క్లుప్తంగా

26న ఇంద్రజాల ప్రదర్శన

మురళీనగర్: మాధవధార మహిళా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ నెల 26న మ్యాజిక్ షో నిర్వహించనున్నట్లు క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు కె.మాధవి, పి.కమల ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం సాయంత్రం 6 గంటలకు ఈస్ట్ పార్కులోని అబ్దుల్ కలాం ఆడిటోరియంలో హరీష్ పట్నాయక్ ఇంద్రజాల ప్రదర్శన ఉంటుందన్నారు. కార్యక్రమంలో వాకర్స్, మహిళలు, ప్రజలందరూ పాల్గొని ఆనందించాలని వారు కోరారు.

వైభవ్ పార్కు అభివృద్ధికి వినతి



మేయర్ పీలాకు వినతిపత్రం అందిస్తున్న ఎన్‌జీజీవోస్ కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు

మురళీనగర్: ఎన్‌జీజీవోస్ కాలనీలోని వైభవ్ పార్కులో సందర్శకులు, వాకర్స్‌కు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు వీరు బుధవారం మేయర్ పీలా శ్రీనివాసరావును కలిసి వినతిపత్రం అందించారు. ముఖ్యంగా పార్కులోని షటిల్ కోర్టును అభివృద్ధి చేయాలన్నారు. ఈ క్రీడా మైదాన ప్రాంగణం ఫ్లోరింగ్‌తోపాటు ఫౌంటెయిన్, ఎలక్ట్రికల్ డూమ్ లైట్ల ఏర్పాటు, విద్యుదీకరణకు చర్యలు తీసుకోవాలని, ఇందుకు అవసరమైన నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. మేయర్‌ను కలిసిన వారిలో ఎన్‌జీజీవోస్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి కె.రామచంద్రరాజు, ఉపాధ్యక్షుడు పి.బలరామస్వామి ఉన్నారు.

కాళీ కాలభైరవులకు రుద్రాభిషేకం



లలితా పీఠంలో కాళీ కాలభైరవులకు రుద్రాభిషేకం చేస్తున్న పండితులు

సీతంపేట: మాస శివరాత్రి సందర్భంగా అక్కయ్యపాలెం లలితానగర్‌లోని శ్రీలలితా పీఠంలో బుధవారం కాళీ కాళభైరవులకు మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. పండితుల వేదమంత్రాల మధ్య శాస్త్రోక్తంగా జరిపించారు. స్థానిక భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. అమావాస్య సందర్భంగా గురువారం ఉదయం 10 గంటలకు శ్రీ అధర్వణ ప్రత్యంగిర భద్రకాళి హోమం జరుగుతుందని పీఠం మేనేజర్ మన్నవ కృష్ణచైతన్య తెలిపారు.

గ్రంథాలయాన్ని అభివృద్ధి చేయండి

అల్లిపురం: గ్రంథాలయాన్ని అభివృద్ధి చేయాలని, ప్రజలకు గ్రంథాలయాల ఆవశ్యకత తెలిసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బి.కుమార్‌రాజు అన్నారు. బుధవారం ఆయన అల్లిపురం శాఖా గ్రంథాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఆయన గ్రంథాలయాధికారి పీవీఎస్ రాజుతో మాట్లాడుతూ దగ్గరలోని స్కూళ్ల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులను ఆహ్వానించి బుక్ ఫెస్టివల్, బుక్ షో వంటి కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. గ్రంథాలయానికి ధరావతులు సేకరించాలన్నారు. విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించాలని తెలిపారు.

హత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి అరెస్ట్

అల్లిపురం: ఖైనీ ప్యాకెట్ అడిగితే ఇవ్వలేదని బటన్ నైఫ్‌తో దాడికి పాల్పడిన వ్యక్తిని టూటౌన్ పోలీసులు బుధవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. టూటౌన్ సీఐ వీవీసీఎం ఎర్రంనాయుడు తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 21వ తేదీన చలువతోటకు చెందిన దేవుపల్లి విజయ్‌రాజు చలువతోట రోడ్డులో గల వాటర్ ప్లాంట్ సమీపంలోని ఒక కిల్లీ బడ్డీ వద్ద నిల్చున్నాడు. ఆ సమయంలో అదే ప్రాంతానికి చెందిన వాసుపల్లి విజయ్ అక్కడికి చేరుకున్నాడు. విజయ్, విజయ్ రాజుని ఖైనీ ప్యాకెట్టు ఇమ్మని అడిగాడు. అతను ఇవ్వనని చెప్పడంతో కోపగించుకున్న విజయ్ అతనిపై బటన్ నైఫ్‌తో భుజంపై దాడి చేయడంతో విజయ్‌రాజు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు అతన్ని చికిత్స నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. బాధితుని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

ఇదేనా స్వచ్ఛత..!





పోర్టు స్టేడియం పక్కన సర్వీస్ రోడ్డులో శిథిలమైన డస్ట్ బిన్లు



సీతమ్మధార క్షత్రియ కళ్యాణ మండపం వద్ద చక్రం లేని డంపర్ బిన్

- 14వ వార్డులో మూలకు చేరిన డస్ట్ బిన్లు
- శిథిలమైన వాటినే వినియోగిస్తున్న పారిశుధ్య సిబ్బంది
- రోడ్ల మీదకు చెత్త చేరడంతో ఇబ్బందులు
- కొత్త బిన్లు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 14వ వార్డులోని పలు ప్రాంతాల్లో చెత్త వేసేందుకు ఏర్పాటు చేసిన డస్ట్ బిన్లు శిథిలావస్థకు చేరాయి. వాటికి ఇరువైపులా తుప్పుపట్టి పెద్ద పెద్ద రంధ్రాలు ఏర్పడ్డాయి. దీంతో డస్ట్ బిన్లలో వేసిన చెత్త సరాసరి రోడ్డు మీదకు వచ్చి చేరుతోంది. కొన్నిసార్లు వాటిలోని వ్యర్థాలను కుక్కలు బయటకు లాగి చెల్లాచెదురు చేస్తున్నాయి. పరిసరాలు అధ్వానంగా మారడంతో స్థానికులు, వాహన చోదకులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ వార్డులో శిథిలమై మూలకు చేరిన డస్ట్ బిన్లనే చెత్త వేసేందుకు జీవీఎంసీ పారిశుధ్య సిబ్బంది వినియోగిస్తున్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సెలవిచ్చే జీవీఎంసీ అధికారులు, సిబ్బంది శుభ్రత విషయంలో రాజీ పడుతూ పట్టించుకోకుండా వదిలేయడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఎంతో వ్యయంతో అనేక పరికరాలు కొంటున్న జీవీఎంసీ అధికారులు, సరిపడా డంపర్, డస్ట్ బిన్‌లు కొనలేరా? వీటిని సరిగా నిర్వహించలేరా.. అని పలువురు ప్రశ్నిస్తున్నారు. స్వచ్ఛత అంటే ఇదేనా అని విమర్శిస్తున్నారు.



నార్త్ ఎక్స్‌టెన్షన్ పాపా హోం ఎదురుగా రోడ్డు మీదే చెత్త

సర్వీస్ రోడ్డులో చిందరవందర

అక్కయ్యపాలెం హైవేలోని పోర్టు స్టేడియం పక్కనే గల సర్వీస్ రోడ్డులో రెండు డస్ట్ బిన్లు ఉన్నాయి. ఇవి పూర్తిగా పాడయ్యాయి. ఈ శిథిల బిన్లను మార్చకుండా వాటిలోనే చెత్తను వేస్తుండటంతో పరిసరాలు చిందరవందరగా మారుతున్నాయి. వీటిలో వేసే చెత్త రోడ్డు మీదకు చేరడంతో దుర్వాసన, దోమలు వ్యాపిస్తున్నాయి.

- పోర్టు స్టేడియం ఈస్ట్ గేట్ ఎదురు రోడ్డులో ఓ శిథిల డస్ట్ బిన్ ఉంది. దాని పక్కనే బాగున్న బిన్లు ఉన్నా.. ఇక్కడ పూర్తిగా తుప్పుపట్టి, ఎందుకు పనికిరాకుండా పక్కకు పడేసిన డస్ట్ బిన్ వల్ల ఈ ప్రాంతంలో దుర్గంధం వ్యాపిస్తోంది.
- సీతమ్మధార క్షత్రియ కళ్యాణ మండపం పక్కనే రెండు డస్ట్ బిన్లు ఏర్పాటు చేశారు. వాటిలో ఒకటి ఒక చక్రం లేకుండా పక్కకు ఒరిగిపోయి ఉంది. దీంతో ఈ బిన్‌లో చెత్త వేసేందుకు పనికి రాకుండా పోయింది. ఈ ప్రాంతాల్లో శిథిలమైన డస్ట్ బిన్లను తొలగించి, కొత్తవి ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

డస్ట్ బిన్లు చాలక..

సీతమ్మధార క్షత్రియ కళ్యాణ మండపం, నార్త్ ఎక్స్‌టెన్షన్ తదితర ప్రాంతాల్లో తగినన్ని డస్ట్ బిన్లు లేవు. ఈ ప్రాంతాల్లో సేకరించిన చెత్తను డస్ట్ బిన్లలో వేసేందుకు అవి చాలడం లేదు. చెత్త తరలించే వాహనాలు ఎలాగూ వస్తాయని జీవీఎంసీ సిబ్బంది, స్థానికులు కూడా చెత్తను రోడ్డు మీదే వేస్తున్నారు. జీవీఎంసీ వాహనాలు వచ్చేసరికి ఈ చెత్త రోడ్డంతా వ్యాపించడం, పరిసరాలు చెత్తాచెదారం, దుర్గంధంతో నిండిపోవడం జరుగుతున్నాయి. దీంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ఈ సమస్యను పరిష్కరించాలని 14వ వార్డు వాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.



పోర్ట్ స్టేడియం ఈస్ట్ గేట్ పక్కన శిథిలమైన డస్ట్ బిన్

అలరించిన కథా కచేరీ



కథ చదవుతున్న రచయిత చిన సూర్యనారాయణ

సీతంపేట: సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం రాజేంద్రనగర్ ప్రిజమ్ కళాశాలలో నిర్వహించిన కథా కచేరీలో రచయితలు సమాజంలో వివిధ రకాల సమస్యలపై రాసి చదివిన కథలు అలరించాయి. ఈ సందర్భంగా సభాధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ కథా రచన సమాజంలో సాంఘిక జీవనం, సమాజ రుగ్మతలు ప్రతిబింబించే విధంగా ఉండాలన్నారు. రచయిత డాక్టర్ సూర్యారావు మాట్లాడుతూ రచయితలకు కథా రచనలో మెలకువలు సూచించారు. అనంతరం జరిగిన కథా కచేరీలో పలువురు రచయితలు తమ స్వీయ రచాన కథలు చదవి వినిపించారు. రచయిత కె.వి.ఎస్.మూర్తి 'రెండో భార్య', అయ్యల సోమయాజుల ప్రసాద్ 'మృత్యుంజయుడు', దుర్గాప్రసన్న 'పెళ్లిచూపులు', ఉప్పల అప్పలరాజు 'కళ్లు', భాగవతుల సత్యనారాయణమూర్తి 'పిలవని పేరంటం, చిన సూర్యనారాయణ 'గొడుగ్గాడు', చల్లా రాంబాబు 'జైజై గణేశా' కొత్తూరు రమణ 'మూర్తి గారి అమ్మాయి' కథలు ఆలోచింపజేశాయి.

వ్యక్తి ఆత్మహత్య

ఆరిలోవ: ఆరిలోవ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జీవీఎంసీ 10 వార్డు తోటగరువు దరి బి.ఎస్.ఆర్.నగర్‌లో కుటుంబంతో కలిసి నివసిస్తున్న మామిడి గంగరాజు(36) ఆటో నడుపుతుండేవాడు. అతడి భార్య జానకి మంగళవారం తల్లిదండ్రుల ఇంటికి వెళ్లింది. సాయంత్రం తిరిగి ఇంటికి వచ్చేసరికి భర్త గంగరాజు ఫ్యాన్‌కు ఉరి వేసుకొని కనిపించాడు. ఆమె భయంతో ఇరుగు పొరుగు వారిని పిలిచి వారి సహాయంతో భర్తను కిందకి దించి వెంటనే విమ్స్‌కు తరలించారు. అక్కడ వైద్యులు అప్పటికే గంగరాజు మృతి చెందినట్లు నిర్ధారించారు. జానకి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆరిలోవ పోలీసులు ఆత్మహత్యగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోలీసులు మృతదేహానికి బుధవారం పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

దివ్యాంగ పిల్లలకు స్పీచ్ థెరపీలో శిక్షణ

సీతంపేట: కలెక్టర్, విద్యా శాఖాధికారి, సమగ్ర శిక్ష అదనపు పథక సమన్వయకర్త ఆదేశాల మేరకు అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీలోని భవిత సెంటర్‌లో బుధవారం దివ్యాంగ పిల్లలకు స్పీచ్ థెరపీలో శిక్షణ ఇచ్చారు. నగరంలోని సీతమ్మధార, గోపాలపట్నం, మహారాణిపేట, పెందుర్తి, చినగదిలి ఐదు మండలాలకు చెందిన స్పీచ్ ప్రాబ్లం ఉన్న 70 మంది దివ్యాంగ పిల్లలు పాల్గొన్నారు. వీరికి భాష ఉచ్చరణలో అభివృద్ధి సాధించేందుకు స్పీచ్ థెరపిస్ట్ బాలేశ్వరి శిక్షణనిచ్చారు. పిల్లలకు, తల్లిదండ్రులకు స్పీచ్ థెరపీకి సంబంధించి అత్యంత ముఖ్యమైన మెళకువలను తెలియజేశారు. వారంలో రెండు రోజుల చొప్పున ప్రతి మండలానికి ఒక కేంద్రంగా స్పీచ్ థెరపీ అవసరమైన పిల్లలందరికీ జిల్లాలోని అన్ని మండలాలు కవర్ అయ్యేలా శిక్షణ ఇస్తామని బాలేశ్వరి తెలిపారు. కార్యక్రమంలో జిల్లా విద్యా శాఖాధికారి ఎన్.ప్రేమ్‌కుమార్, అదనపు పథక సమన్వయకర్త డాక్టర్ జె.చంద్రశేఖర్, సీతమ్మధార మండల విద్యా శాఖాధికారులు రామారావు, బాలామణి, పాఠశాల హెచ్‌ఎం జయంతి రాధాకుమారి, ఐఈఆర్‌పీ ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



చిన్నారికి స్పీచ్ థెరపీ శిక్షణ ఇస్తున్న థెరపిస్ట్ బాలేశ్వరి

'రాజుగాని సవాల్' చిత్రబృందం సందడి

సీతంపేట: విశాఖలో రాజుగాని సవాల్ మూవీ టీం సందడి చేసింది. లెలిజాల రవీందర్, సంధ్య రాథోడ్, రితికా చక్రవర్తి హీరో హీరోయిన్‌లుగా నటిస్తున్న ఈ చిత్రం ఆగస్టు 8న శ్రీలక్ష్మి పిక్చర్స్ ద్వారా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు సిద్ధమైంది. ఈ సందర్భంగా బుధవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హీరో, దర్శక, నిర్మాత రవీందర్ మాట్లాడుతూ తమ జీవితాల్లో జరిగిన రియల్ ఇన్సిడెంట్ల ఆధారంగా రూపొందించిన చిత్రమని తెలిపారు. మధ్యతరగతి ప్రజల జీవితంలో ఎన్నో సవాలుంటాయని, అలాంటి సందర్భంలో ఒక పెద్ద సమస్య ఎదురైతే ఆ మిడిల్ క్లాస్ పర్సన్ ఎలా ఎదుర్కొన్నాడనేది సినిమాలో చూస్తారని చెప్పారు. కవాడిగూడ రియల్ లొకేషన్లలో షూటింగ్ చేశామన్నారు. హీరోయిన్ రితికా చక్రవర్తి మాట్లాడుతూ ఈ మూవీ కోసం అంతా కష్టపడి పనిచేశామని, ప్రతి ఒక్కరూ రిలేట్ చేసుకుంటారన్నారు. ఈ చిత్రాన్ని లెలిజాల కమల ప్రజాపతి సమర్పణలో ఎల్ఆర్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై లెలిజాల రవీందర్ నిర్మిస్తూ దర్శకత్వం వహిస్తున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో బాపిరాజు డిస్ట్రిబూట్ చేస్తున్నారు.



మీడియా సమావేశంలో హీరో హీరోయిన్లు లెలిజాల రవీందర్, రితికా చక్రవర్తి

ప్రజారోగ్య విభాగం ఆకస్మిక తనిఖీ

డాబాగార్డెన్స్: జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ బుధవారం జీవీఎంసీ ప్రజారోగ్య విభాగాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. జీవీఎంసీ అన్ని విభాగాల ఉద్యోగులు నిర్ణీత సమయానికే విధుల్లో ఉండాలని ఆదేశించారు. స్టాటస్టికల్ ఆఫీసర్ పీవీడీ ప్రసాదరావు చాంబర్‌లో బర్త్ అండ్ డెత్ వివరాలు, నమోదు ప్రక్రియను అడిగి తెలుసుకున్నారు. జీవీఎంసీ పరిధిలో ఎన్ని హాస్పిటల్స్ నమోదై ఉన్నాయో ఆరా తీశారు. 238 హాస్పిటల్స్ రిజిస్ట్రేషన్ అయ్యాయని స్టాటస్టికల్ ఆఫీసర్ తెలిపారు. బర్త్ అండ్ డెత్ సర్టిఫికెట్లు ప్రస్తుతం ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. సంబంధిత అర్జీల మేరకు వెంటనే జారీ చేసేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జీవీఎంసీలో రిజిస్ట్రేషన్ కాని బర్త్ అండ్ డెత్ నమోదులు జరిగే క్లినిక్‌లు, ఆస్పత్రులు ఏమైనా ఉంటే సీఆర్‌ఎస్ పోర్టల్ ద్వారా నమోదయ్యేలా చూడాలని ఆదేశించారు. జనన, మరణ ధ్రువీకరణ పత్రాల జారీలో నిర్లక్ష్యం వహించరాదని ప్రధాన వైద్యాధికారి నరేష్ కుమార్‌ను కమిషనర్ ఆదేశించారు.



బీడీఆర్ సెక్షన్ అధికారులతో మాట్లాడుతున్న జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్

ఘనంగా బీఎంఎస్ వ్యవస్థాపక దినోత్సవం

డాబాగార్డెన్స్: కార్మికుల పక్షాన నిలబడి, సమస్యల పరిష్కారానికి నిజాయితీగా పోరాడేది భారతీయ మజ్దూర్ సంఘ్ మాత్రమేనని ఇండియన్ నేవీ సివిలియన్ మజ్దూర్ సంఘ్ గౌరవ అధ్యక్షుడు పైలా దేముడునాయుడు తెలిపారు. నేవల్ డాక్‌యార్డ్ విజయనగర్ గేట్ ఎదురుగా బీఎంఎస్ 70వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం ఐఎన్‌సీఎంఎస్ అధ్యక్షుడు పుట్టా విద్యాసాగర్, కార్యదర్శి ఎస్.రాజేష్, బీఎంఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు చింతాడ రమణతో కలిసి దేముడునాయుడు జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్మికుల సంక్షేమంతో పాటు వారి న్యాయమైన హక్కుల సాధన, కార్మికుల్లో దేశభక్తిని నింపేందుకు, తాము పని చేసే పరిశ్రమల పురోభివృద్ధే పరమావధిగా బీఎంఎస్ పని చేస్తుందన్నారు. యాజమాన్యాల్ని బెదిరించి పరిశ్రమలు ఖాయిలా పడేలా అనైతిక సమ్మెకు దిగే విధానాన్ని బీఎంఎస్ వ్యతిరేకిస్తుందన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు సత్యానందం, బి.సత్య శ్రీనివాస్, కె.వెంకట్‌నాయుడు, పంపా రవి కుమార్, పి.సురేష్ తదితరులు పాల్గొన్నారు.



వేడుకల్లో పాల్గొన్న యూనియన్ నాయకులు, ఉద్యోగులు

వానప్రస్థ ఆశ్రమంలో వృద్ధుడికి ఆశ్రయం



వృద్ధుడిని పరామర్శిస్తున్న వానప్రస్థ ఆశ్రమ నిర్వాహకుడు రొబ్బి శ్రీనివాస్

మురళీనగర్: వృద్ధుల సేవలో తరిస్తున్న పట్టాభిరెడ్డి తోటలోని వానప్రస్థ వృద్ధాశ్రమం తన మానవత్వాన్ని చాటుకుంది. దొండపర్తి రైల్వే స్టేషన్ ఫ్లై ఓవర్ కింద నిస్సహాయ స్థితిలో పడి ఉన్న ఒక వృద్ధుడిని చేరదీసి ఆశ్రయమిచ్చింది. ఆశ్రమ నిర్వాహకుడు రొబ్బి శ్రీనివాస్ ఆ వృద్ధుడి వివరాలు తెలిసుకుని దొండపర్తిలోని వంతెన వద్దకు చేరుకుని ఆశ్రమానికి తీసుకుని వచ్చారు. వృద్ధుడి ఆరోగ్య పరిరక్షణకు చర్యలు తీసుకుని అవసరమైన సౌకర్యాలు కల్పించారు. వృద్ధుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారని నిర్వాహకుడు తెలిపారు.

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ.1.5 లక్షల విరాళం



ఎస్‌బీఐ పెన్షనర్స్ క్లబ్ ప్రతినిధులకు బాండ్ అందజేస్తున్న ఏఈఓ తిరుమలేశ్వరరావు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి బుధవారం నగరంలోని సిరిపురానికి చెందిన ఎస్‌బీఐ పెన్షనర్స్ క్లబ్ రూ.1.50 లక్షల విరాళం అందజేసింది. సింహగిరికి వచ్చిన క్లబ్ ప్రతినిధులు విరాళాన్ని నగదు రూపంలో పీఆర్‌వో కార్యాలయంలో అందజేశారు. వారికి దేవస్థానం తరఫున ఏఈవో తిరుమలేశ్వరరావు బాండ్ అందజేశారు. ఆలయ అధికారులు స్వామి దర్శనం కల్పించి ప్రసాదం అందించారు.

'ఉక్కు' యాజమాన్యం వైఖరి మార్చుకోవాలి



మాట్లాడుతున్న అయోధ్యరామ్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం ఏకపక్ష నిర్ణయాల వల్ల కార్మికులు ఇబ్బంది పడుతున్నారని.. ఉత్పత్తి ప్రభావం చూపుతోందని స్టీల్ సీఐటీయూ గౌరవాధ్యక్షుడు జె.అయోధ్యరామ్ అన్నారు. స్టీల్ సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం ఉక్కు పరిపాలన భవనం వద్ద యాజమాన్యం వైఖరికి నిరసనగా ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం కార్మిక హక్కులను కాలరాస్తోందని ఆరోపించారు. కార్మికులతో కనీసం చర్చించకుండా విభాగాలు మార్చడం వారి ఏకపక్ష నిర్ణయానికి నిదర్శనమన్నారు. మూడు నెలల్లో సుమారు రూ.200 కోట్లు లాభాలు వచ్చినా కార్మికులకు బకాయి జీతాలు చెల్లించకుండా మీనమేషాలు లెక్కిస్తోందన్నారు. హెచ్‌ఆర్‌ఏ చెల్లింపు, కరెంటు చార్జీల తగ్గింపు వంటి సమస్యలపై నేటికీ చర్యలు తీసుకోకపోవడం అన్యాయమన్నారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్లాంట్‌లోని ఒక్కో విభాగాన్ని ప్రైవేటు వ్యక్తులకు అప్పగించేందుకు అడుగులు వేస్తోందన్నారు. కార్యక్రమంలో నాయకులు టి.వి.కె.రాజు, తాడన్న, కె.గంగాధర్, పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తరాంధ్ర వెనుకబాటుకు చంద్రబాబే కారణం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజు

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజు
- 50వ వార్డులో 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ'

మురళీనగర్: ఉత్తరాంధ్ర వెనుకబాటుకు ముఖ్యమంత్రి చంద్రబాబే కారణమని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు అన్నారు. 50వ వార్డు కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్ ఆధ్వర్యంలో వార్డులోని పార్టీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. దివంగత, మాజీ ముఖ్యమంత్రులు వైఎస్ రాజశేఖరరెడ్డి, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో మాత్రమే ఉత్తరాంధ్ర అభివృద్ధి జరిగిందని తెలిపారు. చంద్రబాబు చేసిన మోసాలను, కూటమి ప్రభుత్వ అరాచకాలను వివరించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రజాపక్షంగా ఉంటూ కూటమి ప్రభుత్వం ప్రజలకు చేస్తున్న మోసాలను ప్రశ్నించాలన్నారు. ముందుగా మహానేత వైఎస్సార్ చిత్రపటానికి కె.కె.రాజు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ 50వ వార్డు అధ్యక్షుడు లాలం వేణుగోపాల స్వామి, వార్డు నాయకులు సనపల వరదరాజులు, పైడి శ్రీనివాస్, సనపల నారాయణస్వామి, పైడి ప్రతాప్, బుడుమూరు తిరుమలరావు, మాసిన లక్ష్మి, సరస్వతి, కనమటి రఘు, రమేష్, పాతపట్నం రామ్మోహన్, శివరాం, సుజాత, ఎ.వి.ఎస్.రాజు, టి.ఎస్.రెడ్డి, ఎం.వి.రెడ్డి, కింతల రాజారావు, మురళీధర్, త్రినాథ్, కంచరాని మోహన్, పేడాడ సంతోష్, శ్రీనివాస్‌రెడ్డి, దిలీప్, బుజ్జి, ప్రకాష్, జ్యోతి, బోలం అప్పలరాజు, విజయ్, సనపల వరహా నరసింహం, అమర్ రెడ్డి, రాంబాబు, నూకరాజు, జిల్లా గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు కర్రి రామరెడ్డి, వార్డు నాయకులు, కార్యకర్తలు, బూత్ కన్వీనర్లు, సభ్యులు, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణాను అరికడదాం

తాటిచెట్లపాలెం: ఈ నెల 30న అంతర్జాతీయ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని బాల వికాస్ ఫౌండేషన్ మానవ అక్రమ రవాణాను అరికట్టండి అనే నినాదంతో రూపొందించిన పోస్టర్‌ను బుధవారం సీతమ్మధారలోని డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా చీఫ్ జనరల్ మేనేజర్ కెప్టెన్ ఎస్.దివాకర్ తన చాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు ప్రపంచం ఎదుర్కొంటున్న సమస్యల్లో మానవ అక్రమ రవాణా కూడా ఒకటని, దీని ద్వారా ఎంతోమంది అమాయకులు బలవుతున్నారన్నారు. వివిధ కారణాల వల్ల దేశంలోని ఆడ, మగపిల్లలు అక్రమ రవాణా చేయబడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అనాగరిగ చర్యకు వ్యతిరేకంగా సమాజంలో ప్రతి ఒక్కరూ సరైన అవగాహన పొంది, ప్రభుత్వంతోపాటు పలు స్వచ్ఛంద సంస్థలు కలిసి పనిచేయడం ద్వారా దీనిని అరికట్టవచ్చన్నారు. కార్యక్రమంలో బాల వికాస్ ఫౌండేషన్ వ్యవస్థాపక కార్యదర్శి నరవ ప్రకాశరావు, డాక్టర్ బాబ్జీ, మహ్మద్ హుస్సేన్, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న డీసీఐ చీఫ్ జనరల్ మేనేజర్ దివాకర్, బాల వికాస్ ఫౌండేషన్ సభ్యులు